దవాఖానల సేవలు సద్వినియోగం చేసుకోవాలి

పెద్దశంకరంపేట, మార్చి 20: ప్రభుత్వ దవాఖానల సేవలు సద్వినియోగం చేసుకోవాలని నారాయణఖేడ్ ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి అన్నారు. గురువారం పెద్దశంకరంపేట పీహెచ్‌సీలో హైదరాబాద్‌కు చెందిన నీలకంటి దుర్గాప్రసాద్ వారి మిత్రబృందం, పేటకు చెందిన బుడాల సాయిలు అందించిన వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించారు. ఎమ్మెల్యే సైతం రూ.55 వేలతో కూడిన వార్మర్ మిషన్‌ను అందజేయడానికి చెక్కు అందజేశారు. పేట మాజీ సర్పంచ్ అలుగుల సత్యనారాయణ రూ.30 వేలతో ఇన్వర్టర్‌ను పీహెచ్‌సీకి అందజేశారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి సర్ఫొద్దీన్, నాయకులు నారాయణ గౌడ్, ఆర్ఎన్ సంతోష్‌కుమార్, సంగమేశ్వర్, పెరుమాండ్లగౌడ్ తదితరులున్నారు.

వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి

పర్మిట్ రూమ్‌ల ఏర్పాటుకు నిబంధనల్లేవు

వెల్దుర్తి, మార్చి 20: మద్యం దుకాణాలకు అనుబంధంగా ఏర్పాటు చేసే పర్మిట్ రూంల ఏర్పాటుకు ఎలాంటి నిబంధనలు లేవని రామాయంపేట ఎక్సైజ్ సీఐ నరేందర్‌రెడ్డి అన్నారు. రామాయంపేట ఎక్సైజ్ ఎస్సై విజయ్ సిద్దార్థ, సిబ్బందితో కలిసి గురువారం వెల్దుర్తికి వచ్చిన సీఐ వెల్దుర్తిలోని దుర్గా, తిరుమల వైన్స్‌లతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో కల్లు డిపోలను తనిఖీ చేశారు. వైన్స్‌ల్లో రికార్డులు పరిశీలించారు. అన్నిరకాల మద్యం బాటిళ్లు, తగినంత స్టాక్‌ను దుకాణాల్లో అందుబాటులో ఉంచాలని సూచించారు. దుర్గా వైన్స్ పర్మిట్ రూం ఏర్పాటులో నిబంధనలు అతిక్రమించారని, రోడ్డుకు దగ్గరగా ఏర్పాటు చేశారనే ఆరోపణలపై సీఐ మాట్లాడుతూ పర్మిట్ రూం ఏర్పాటుకు ఎలాంటి నిబంధనలు ఉండవని, వైన్స్‌లు ఉన్నచోట పర్మిట్ రూంలు ఏర్పాటు చేసుకోవచ్చన్నారు. వైన్స్‌లకు దగ్గరలో వంద అడుగుల విస్తీర్ణంలో ఈ పర్మిట్ రూంలు ఏర్పాటు చేసుకుంటే సరిపోతుందన్నారు.

వెల్దుర్తిలోని దుర్గా వైన్స్‌లో తనిఖీలు చేస్తున్న రామాయంపేట ఎక్సైజ్ సీఐ నరెందర్‌రెడ్డి

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో బడ్జెట్ పత్రాలు దహనం

మెదక్, మార్చి 20(నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ ప్రభుత్వం విద్యారంగానికి 30 శాతం నిధులు కేటాయించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అజయ్ కుమార్ డిమాండ్ చేశారు. బుధవారం అసెంబ్లీలో విద్యారంగానికి బడ్జెట్‌లో కేటాయించిన నిధులను వ్యతిరేకిస్తూ బడ్జెట్ పత్రాలను ఎస్ఎఫ్ఐ మెదక్ కమిటీ ఆధ్వర్యంలో గురువారం దహనం చేశారు. ఈ సందర్భంగా అజయ్ కుమార్ మాట్లాడుతూ విద్యారంగానికి రేవంత్ రెడ్డి సర్కారు తక్కువ నిధులు కావాలనే కేటాయిస్తున్నదన్నారు. రూ.23వేల 108 కోట్లు విద్యరంగా అభివృద్ధికి సరిపోవన్నారు. ప్రభుత్వ విద్యా సంస్థలు, పాఠశాలలు, కళాశాలలు, హాస్టల్స్, గురుకులాలు, యూనివర్సిటీలు అభివృద్ధి కావాలంటే 30 శాతం నిధులు కేటాయించాలని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ టౌన్ నాయకులు సంగమేశ్, రాజు, నితిన్ తదితరులు పాల్గొన్నారు.

బడ్జెట్ ప్రతులు దహనం చేస్తున్న ఎస్ఎఫ్ఐ విద్యార్థి నాయకులు

కార్మికులకు సామాజిక భద్రత కల్పించాలి

వెల్దుర్తి, మార్చి 20: అసంఘటిత కార్మికులకు సామాజిక భద్రత కల్పించి, వారి సమస్యల పరిష్కరించడమే లక్ష్యంగా అసంఘటిత కార్మికుల మహాధర్నాను చేస్తున్నారని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు మల్లేశం అన్నారు. గురువారం వెల్దుర్తికి వచ్చిన మల్లేశం కార్మికులతో కలిసి మహాధర్నా కరపత్రాన్ని విడుదల చేశారు. బీడీ కార్మికులకు జీవన భృతి, కనీస వేతనాల జీవో విడుదల చేయడంతో పాటు ఇతర సంక్షేమ పథకాలను అమలు చేసి అసంఘటిత కార్మికుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలవాలన్నారు. నేడు హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద నిర్వహించే మహాధర్నాను విజయవంతం చేయాలని కోరారు.

మహాధర్నా కరపత్రంను విడుదల చేస్తున్న మల్లేశం, కార్మికులు

'ఆడపిల్ల పుడితే ఉచిత డెలివరీ'

మెదక్, మార్చి 20(నమస్తే తెలంగాణ): జిల్లా కేంద్రంలోని ఆజాంపురాలోని చిన్నారి మాతా, శిశు దవాఖాన ఏర్పాటు చేసి ఏడాది పూర్తయిన సందర్భంగా ఆడపిల్ల పుడితే ఉచితంగా డెలివరీ చేయనున్నట్టు మహిళా వైద్య నిపుణురాలు సమీనా తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆడపిల్ల పుడితే కొంతమంది నిర్లక్ష్యంగా చెత్తకుప్పల్లో వేయడం మనం చూస్తున్నామని, ఇలా జరగకూడదని, ఆడపిల్లలను బతుకనిద్దాం, కాపాడుదాం అనే విషయాన్ని దృష్టిలో ఉంచుకొని ఆడపిల్ల పుడితే ఉచితంగా డెలివరీ చేయాలని నిర్ణయించామన్నారు. కార్యక్రమంలో యాజమాన్యం పిల్లల వైద్య నిపుణుడు రవితేజ, నయీమ్, నాగరాజు, ఫర్హాన్, గౌరీశంకర్, రషీద్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న చిన్నారి మాత, శిశు ఆసుపత్రి డాక్టర్ సమీనా

విద్యుదాఘాతంతో తాపీమేస్త్రీ మృతి

రాము(ఫైల్)

రామాయంపేట, మార్చి 20: విద్యుదాఘాతంతో తాపీ మేస్త్రీ మృతి చెందిన ఘటన భిక్కనూరు మండలం బస్వాపూర్‌లో బుధవారం రాత్రి జరిగింది. కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. రామాయంపేటకు చెందిన పరుపుగల్ల రాము(26) కూలీపనులు చేస్తాడు. బస్వాపూర్‌లో కూలీపని దొరకడంతో అక్కడికి వెళ్లి పనులు చేస్తున్నాడు. అక్కడ నిర్మిస్తున్న బిల్డింగ్‌పైనే విద్యుత్ కేబుళ్లు ఉన్నాయి. ఇవి గమనించకుండా సలాకలను సరిచేస్తుండగా పైనున్న కేబుల్‌కు సలాకా తాకడంతో విద్యుదాఘాతంతో అక్కడికక్కడే మృతిచెందాడు. భిక్కనూరు పోలీసులు పంచనామా నిర్వహించి పోస్టుమార్టంకు కామారెడ్డి జిల్లా కేంద్రానికి తరలించారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నారు.

తీర్థయాత్ర.. విషాదాంతం

- ఆగి ఉన్న టూరిస్టు బస్సును ఢీకొట్టిన డీసీఎం
- ఇద్దరు మహిళలు మృతి

టూరిస్టు బస్సును ఢీకొట్టిన డీసీఎం

పెద్దశంకరంపేట, మార్చి 20: ఆగి ఉన్న టూరిస్ట్ బస్సును డీసీఎం ఢీకొట్టిన ప్రమాదంలో ఇద్దరు మహిళలు మృతిచెందిన ఘటన పెద్దశంకరంపేట మండలం కోళ్లపల్లి గ్రామ శివారులో 161వ జాతీయ రహదారిపై గురువారం జరిగింది. పేట ఎస్ఐ శంకర్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ విజయనగరం జిల్లావాసులు టూరిస్టు బస్సులో 40 మంది సభ్యులు ఈనెల 13న తీర్థయాత్రలు చేసుకుంటూ మహారాష్ట్రలోని తుల్జాపూర్ నుంచి శ్రీశైలం వెళ్తున్నారు. ఈ క్రమంలో 161వ జాతీయ రహదారిపై కోళ్లపల్లి శివారులో కాలకృత్యాలు తీర్చుకుని టీ తాగేందుకు బస్సును ఆపారు. ఆగిఉన్న బస్సును పిట్లం నుంచి సంగారెడ్డి వైపు వస్తున్న ఐచర్ డీసీఎం వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అప్పల నారాయణమ్మ (50) అక్కడికక్కడే మృతిచెందింది. ఐదుగురు క్షతగాత్రులు పవన్, దేవిక, నారాయణరావుతో పాటు పలువురిని జోగిపేట ప్రభుత్వ దవాఖానకు తరలించారు. జోగిపేటలో చికిత్స పొందుతూ సూరప్పమ్మ(62) మృతిచెందింది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. రాంబాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శంకర్ తెలిపారు.

మాదక ద్రవ్యాల నియంత్రణకు చర్యలు

- ఆపదమిత్ర వలంటీర్లు అవగాహన పెంపొందించుకోవాలి
- కమ్యూనికేషన్ టెక్నాలజీ కేంద్రాల ఏర్పాటు చేసే దిశగా చర్యలు
- కలెక్టర్ రాహుల్‌రాజ్
- గంజాయి నియంత్రణకు ప్రత్యేక డ్రైవ్
- ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

కామన్ సర్వీస్ సెంటర్స్ ప్రాజెక్ట్ బ్రోచర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్, ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డి, పాల్గొన్న అధికారులు

మెదక్, మార్చి 20 (నమస్తే తెలంగాణ): జిల్లాలో మాదక ద్రవ్యాలతో కలిగే నష్టాలపై విస్తృతంగా ప్రచారం చేస్తూ, నియంత్రణకు పక్కా కార్యాచరణ అమలు చేయాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో మాదక ద్రవ్యాల, డ్రగ్స్ నియంత్రణ కోసం చేపట్టిన చర్యలపై ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డితో కలిసి సంబంధిత అధికారులతో జిల్లా స్థాయి నార్కోటిక్ కంట్రోల్ సమావేశాన్ని నిర్వహించారు. నార్కోటిక్ కంట్రోల్ సమావేశంలో జిల్లాలో నమోదవుతున్న ఎన్‌డీపీఎస్ కేసులు, గంజాయి సాగు నివారణ చర్యలు, మాదక ద్రవ్యాల వాడకం నియంత్రణ చర్యలు, మాదక ద్రవ్యాల నివారణ కోసం శాఖల వారీగా చేపట్టాల్సిన కార్యక్రమాలు, డ్రగ్స్ వినియోగంతో కలిగే నష్టాల గురించి చేయాల్సిన విస్తృత ప్రచారం వంటి పలు అంశాలపై చర్చించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం మాదక ద్రవ్యాలు సరఫరా చేసే వారిపై అత్యంత కఠినంగా వ్యవహరిస్తూ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. యువత డ్రగ్స్‌కు ఆకర్షితులైతే దేశ భవిష్యత్ నాశనం అవుతుందన్నారు. దీన్ని గుర్తించి డ్రగ్స్‌తో కలిగే విపరీత పరిణామాలపై అవగాహన కల్పిస్తూనే, సమాంతరంగా వాటి నియంత్రణకు వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. మాదక ద్రవ్యాల రవాణా, సాగు, వినియోగం నివారణకు పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. మాదక ద్రవ్యాలకు బానిసైన వారికి చికిత్స, కౌన్సెలింగ్ అందించేలా చర్యలు తీసుకోవాలని వైద్యారోగ్యశాఖ అధికారులకు సూచించారు. అటవీ శాఖ అధికారులు వారి పరిధిలోని అటవీ భూములు పరిశీలించి గంజాయి సాగు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. జిల్లాలోని దవాఖానలు, మెడికల్ షాపుల్లో స్టాక్ వివరాలు ప్రతినెలా తనిఖీ చేయాలని కలెక్టర్ అధికారులకు సూచించారు.

కమ్యూనికేషన్ టెక్నాలజీ కేంద్రాల ఏర్పాటు

జిల్లాలో మోడల్ కామన్ సర్వీస్ సెంటర్స్ ఇన్ఫర్మేషన్ కమ్యూనికేషన్ టెక్నాలజీ కేంద్రాల ఏర్పాటు దిశగా చర్యలు చేపడుతున్నట్లు కలెక్టర్ రాహుల్‌రాజ్ తెలిపారు. కలెక్టరేట్‌లో కామన్ సర్వీస్ సెంటర్స్ ప్రాజెక్ట్ బ్రోచర్ ఆవిష్కరించారు. జిల్లాలో మారుమూల గ్రామాల్లో డిజిటల్ సేవలతో పాటు బ్యాంకింగ్ ఆధార్ సేవలను అనుసంధానిస్తూ, 100 నిరుద్యోగులకు రాజీవ్ యువ వికాసం పథకం, ఇతర ప్రభుత్వ సబ్సిడీ పథకాల కింద 60-80 శాతం సబ్సిడీతో ఉపాధి అవకాశం కల్పించాలన్నారు. ఈ ప్రాజెక్ట్ ద్వారా మహిళలకు ఉపాధి అవకాశాలతో పాటుగా గ్రామీణ ప్రాంత ప్రజలకు డిజిటల్ సేవలు అందుబాటులోకి తీసుకురావడానికి ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో స్టేట్ ప్రాజెక్టు మేనేజర్ బేతోజు హరికృష్ణ కుమార్, జిల్లా మేనేజర్ అముదాల రాజు, అధికారులు పాల్గొన్నారు.

రుణాల పంపిణీలో లక్ష్యాలు సాధించాలి

కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా స్థాయి బ్యాంకర్ల సంప్రదింపుల కమిటీ త్రైమాసిక సమావేశం ఎల్‌డీఎం నరసింహమూర్తి, డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాసరావు, సంబంధిత అధికారులతో కలిసి సమీక్షించారు. వానకాలం, యాసంగి సీజన్లకు సంబంధించి కేటాయించిన లక్ష్యాలు, సాధించిన ప్రగతి, రానున్న సీజన్‌లో రైతాంగానికి అందించాల్సిన పంట రుణాలు తదితర అంశాలపై ఆయా బ్యాంకుల వారీగా కలెక్టర్ సమీక్షించారు. జిల్లా వార్షిక ప్రణాళిక ప్రకారం వివిధ రంగాల్లో రూ.5857 కోట్లు రుణాల లక్ష్యం ఉండగా, రూ.3732.59 కోట్లు (63.72%) రుణాలు ఇచ్చారన్నారు. ఇందులో వ్యవసాయేతర రుణాల లక్ష్యం రూ.3671 కోట్లు ఉండగా, జిల్లాలో రూ.2613.04 కోట్లు (71%) మంజూరు చేసినట్లు తెలిపారు. పంట రుణాల లక్ష్యం రూ.2274 కోట్లు ఉండగా, జిల్లాలో రూ.1691.11 కోట్లు (74.36%) మంజూరు చేశారని, ప్రణాళిక ప్రకారం రుణాల మంజూరును వంద శాతం చేయాలని బ్యాంకర్స్‌ను సూచించారు. కార్యక్రమానికి డీడీఎం నాబార్డ్ కృష్ణ తేజ, ఎల్డీవో ఆర్బీఐ రెహమాన్, వివిధ వాణిజ్య, సహకార, ఆర్ఆర్‌బీ బ్యాంకుల కంట్రోలర్స్, ఇతర సీనియర్ డిస్ట్రిక్ట్ డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లు తదితరులు పాల్గొన్నారు.

200 మంది వలంటీర్లకు శిక్షణ

జిల్లాలో ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు ఆస్తి, ప్రాణ నష్టం జరగకుండా రక్షణ చర్యలో భాగంగా విపత్తు, సంసిద్ధత అనే అంశాలపై ఆపదమిత్ర వలంటీర్లు అవగాహన పెంపొందించుకోవాలని కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని టీఎన్జీవోస్ భవనంలో యువజన క్రీడల నిర్వహణ శాఖ ఆధ్వర్యంలో నిర్వహణాధికారి వై.దామోదర్‌రెడ్డి, డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాసరావు, జడ్పీ సీఈవో ఎల్లయ్య, మెప్మా పీడీ ఇందిరాతో కలిసి ఆపదమిత్ర వలంటీర్లుకు శిక్షణ కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ భారత ప్రభుత్వం విపత్తు ప్రమాద తగ్గింపు విపత్తు నిర్వహణ వ్యవస్థపై దృష్టి పెట్టడం, విద్యా సామర్థ్యాన్ని బలోపేతం చేయడం, సాంకేతిక పురోగతిని ఉపయోగించడం వంటి అంశాలను దృష్టిలో పెట్టుకొని, దీన్ని తీసుకొచ్చిందన్నారు. శిక్షణలో ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు వరదలు, భూకంపాలు, సునామీలు, అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు, వాటిని ఎలా ఎదురుకోవాలి, వాటి నుంచి ప్రజలను, ఆస్తులను ఎలా కాపాడాలి అనే వాటిపై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

విద్యార్థులకు బెల్టులు, సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎస్సై నర్సింహులు

చిలిపిచెడ్, మార్చి 20: విద్యార్థులు మార్షల్ ఆర్ట్స్‌లో రాణించడంతో శారీరక, మానసిక దృఢత్వం ఏర్పడుతుందని ఎస్సై నర్సింహులు అన్నారు. గురువారం మండలంలోని చిట్కుల్ కేజీబీవీలో వంద మంది విద్యార్థులకు మార్షల్ ఆర్ట్స్ బెల్ట్ ఎగ్జామ్ నిర్వహించారు. అనంతరం విద్యార్థులు చేసిన ప్రదర్శనలను వారు తిలకించారు. కార్యక్రమంలో చంద్రశేఖర్ రెడ్డి, కరాటే మాస్టర్ పోచయ్య, ఎస్‌వో అంజలి, పీఈటీ శారద, మాస్టర్లు మురళి, సుప్రియ, మహేశ్ గౌడ్, విష్ణువర్ధన్, సింధు పాల్గొన్నారు.

బ్యాంకు ఖాతాలో డబ్బు మాయం

- ఎస్‌బీఐ సిబ్బంది చేతివాటం
- రూ. 1,02,300లు వేరే ఖాతాకు బదిలీ

నర్సాపూర్, మార్చి 20: ఇంట్లో డబ్బులు ఉంచితే దొంగలు ఎత్తుకెళ్తారని బ్యాంకులో దాచితే, బ్యాంకు ఖాతాలోంచి డబ్బులు మాయం చేసిన ఘటన నర్సాపూర్ ఎస్బీఐలో గురువారం వెలుగుచూసింది. మృతి చెందిన ఖాతాదారుడి ఖాతా నుంచి ఏకంగా రూ.1,02,300లు మాయం చేసి ఇతర ఖాతాలోకి మళ్లించారు. బాధితుల వివరాల ప్రకారం.. మండలంలోని మూసాపేట్‌కు చెందిన నాగమోళ్ల ఆగమయ్యకు నర్సాపూర్ ఎస్‌బీఐ బ్రాంచిలో ఖాతా ఉంది. మూడేండ్ల క్రితం ఆయన మృతిచెందాడు. ఆగమయ్య మరణించే నాటికి అతని ఖాతాలో రూ.1,53,000లు ఉన్నాయి. అతని కుమారుడు నాగమోళ్ల లక్ష్మయ్య ఫిబ్రవరిలో తండ్రి అకౌంట్‌లో నుంచి డబ్బులు ఇవ్వాలని బ్యాంకు అధికారులను కోరాడు. డెత్ సర్టిఫికెట్ తీసుకొస్తే ఇస్తామని తెలిపారు. మృతుడి కుమారుడు లక్ష్మయ్య సర్టిఫికెట్లను తీసుకుని బ్యాంకుకు వెళ్లాడు. కొత్త ఖాతా తెరిచాడు. బ్యాంకు అధికారులు అందులో రూ.50వేలు మాత్రమే వేశారు. అదే నెల 10న రూ.1,02,300 ఖాతాదారుడి అనుమతి లేకుండానే బ్యాంకు సిబ్బంది వేరే వ్యక్తి ఖాతాలోకి బదిలీచేశారు. మిగతా డబ్బుల గురించి అధికారులను నిలదీయగా, నీకు అంతే డబ్బులు వస్తాయని తిట్టి పంపించారు. తెలిసినవారిని తీసుకెళ్లి అడుగగా, సిబ్బంది తప్పిదం జరిగిందని, బాధితుడి ఖాతాలోకి డబ్బులు జమ చేస్తామని తెలిపారు. ఈ విషయం ప్రచారం జరగడంతో మిగతా ఖాతాదారులు తమ ఖాతాలు చెక్ చేసుకుంటున్నారు.

అన్న కుటుంబంపై తమ్ముడి దాడి

శివ్వంపేట, మార్చి 20: బోరు విషయంలో అన్న కుటుంబంపై తమ్ముడి కుటుంబం బుధవారం అర్ధరాత్రి గొడ్డలి, కర్రలు, రాళ్లతో దాడి చేయడంతో ఐదుగురికి తీవ్ర గాయాలైన ఘటన మండలంలోని తిమ్మాపూర్‌లో జరిగింది. వివరాల్లోకి వెళితే గ్రామానికి చెందిన రాచ్‌పల్లి బాలయ్య, రాచ్‌పల్లి భిక్షపతి అన్నదమ్ములు. రాచ్‌పల్లి బాలయ్యకు రెండెకరాల పొలం ఉంది. బోరు నుంచి నీరు రాకపోవడంతో బుధవారం రాత్రి ఇంటివద్ద బోరు వేసేందుకు ఏర్పాట్లు చేసుకున్నాడు. బాలయ్య ఇంటికి బోరు బండి రావాలంటే భిక్షపతికి చెందిన బీడు పొలం మీదుగా రావాలి. భిక్షపతి బీడుగా ఉన్న పొలంలో బోరుబడి రాకుండా నిండుగా నీరు పారించాడు. దీంతో ఇరు కుటుంబాల మధ్య గొడవ జరిగి గొడ్డళ్లతో కొట్టుకున్నారు. దాడి చేసిన భిక్షపతి, ప్రసాద్, రాజుపై పోలీసులు కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్సై మధుకర్‌రెడ్డి తెలిపారు.

మట్టి అక్రమ రవాణాను అడ్డుకోవాలి

- డంపింగ్‌యార్డుతో గాలి, నీరు కలుషితం
- ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

నర్సాపూర్‌లో సంఘీభావం తెలుపుతున్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

నర్సాపూర్, మార్చి 20: స్వచ్ఛంద సంస్థల పేరుతో చెరువు, కుంటల నుంచి అక్రమంగా తరలిస్తున్న మట్టి రవాణాను అడ్డుకోవాలని ఎమ్మెల్యే నీటిపారుదల శాఖ అధికారులను ఆదేశించారు. నర్సాపూర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలోని నీటిపారుదల శాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామస్తులు, రైతులకు కాకుండా అక్రమంగా చెరువులు, కుంటల్లోని మట్టిని తరలిస్తే అనుమతులను రద్దు చేయాలని ఆదేశించారు. అధికారులు, తనకు ఎలాంటి సమాచారం లేకుండానే అక్రమంగా మట్టిని తరలిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామాల్లోని చెరువు, కుంటలకు సంబంధించిన సమస్యలను తన దృష్టికి తీసుకురావాలన్నారు. సంబంధిత మంత్రితో మాట్లాడి సమస్యలను పరిష్కరిస్తానని వెల్లడించారు. కాళేశ్వరం కాలువ పనులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయని, పనులు పూర్తయితే మల్లన్న సాగర్, కొండపోచమ్మ నుంచి సాగునీరు వస్తాయన్నారు. బీఆర్ఎస్ హయాంలోనే మిషన్ కాకతీయ పథకం ద్వారా చెరువులు, కుంటలు బాగు పడ్డాయని, ఇప్పుడు స్వచ్ఛంద సంస్థల పేరుతో మట్టిని తీసి చేసేది ఏమీలేదన్నారు. కార్యక్రమంలో నీటిపారుదల శాఖ ఈఈ శ్రీనివాస్‌రావు, మాజీ వైస్ ఎంపీపీ వెంకటనర్సింగరావు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు చంద్రశేఖర్, ఇరిగేషన్ ఏఈలు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డుతో గాలి, నీరు కలుషితం

ప్యారానగర్‌లో నిర్మిస్తున్న డంపింగ్ యార్డుతో గాలి, నీరు కలుషితం అవుతాయని ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి ఆవేదన వ్యక్తంచేశారు. సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలం ప్యారానగర్‌లో ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న జీహెచ్‌ఎంసీ డంపింగ్‌యార్డుకు వ్యతిరేకంగా గురువారం నర్సాపూర్‌లో చేపట్టిన రిలేనిరాహారదీక్షకు ఎమ్మెల్యే సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డంపింగ్‌యార్డు ఏర్పాటుతో మూడు మండలాల ప్రజలు జీవించలేని పరిస్థితి నెలకొంటుందన్నారు. దీంతో అనేక రకాల వ్యాధులు వ్యాపించే అవకాశాలు ఉన్నాయని, తక్షణమే డంపింగ్‌యార్డు పనులు నిలిపివేయాలని డిమాండ్ చేశారు.

చలివేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

నర్సాపూర్‌లోని చౌరస్తాలో ఎమ్మెల్యే చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎండాకాలంలో దప్పికను తీర్చుకోడానికి చలివేంద్రాలు ఉపయోగపడుతాయన్నారు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు సత్యంగౌడ్, మండల అధ్యక్షుడు చంద్రశేఖర్, నాయకులు హరికృష్ణ, మహేందర్‌రెడ్డి, ఆంజనేయులుగౌడ్, తొంట వినయ్, విఠల్‌గుప్తా, కిషన్‌గౌడ్, రమేశ్‌గౌడ్, నర్సింహులు, మహేందర్‌రెడ్డి, దశరథ, మానయ్య, జగపతి, సలీం అలీ పాల్గొన్నారు.

పాముకాటుతో మహిళ మృతి

రుద్రోజు సుశీల (ఫైల్)

రామాయంపేట, మార్చి 20: పాముకాటుతో మహిళ మృతి చెందిన ఘటన రామాయంపేటలోని దుర్గమ్మ బస్తీలో బుధవారం రాత్రి జరిగింది. కుటుంబీకుల వివరాల ప్రకారం.. రుద్రోజు సుశీల(55) ఎప్పటిలాగే తన ఇంట్లో నిద్రించింది. మహిళను చెడుగు అనే విష సర్పం కాటు వేసింది. వెంటనే కుటుంబీకులు చూసి దాన్ని చంపేశారు. మహిళను ప్రభుత్వ దవాఖానకు తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు. మహిళకు ఇద్దరు పిల్లలున్నారు.

పంటలను పరిశీలించిన ఏవో

ధర్మారంలో ఎండిన వరిపంటను పరిశీలిస్తున్న ఏవో, ఏఈవో, రైతులు

వెల్దుర్తి, మార్చి 20: మండలంలోని ధర్మారంలో నీటి ఎద్దడితో ఎండిన వరి పంటలను ఏవో ఝాన్సీ, ఏఈవో వందన రైతులతో కలిసి గురువారం పరిశీలించారు. అనంతరం ఏవో మాట్లాడుతూ మండలంలోని పలు గ్రామాల్లో తీవ్ర నీటి ఎద్దడితో పంటలు ఎండిపోతున్నాయని అన్నారు. రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వనరులకు అనుగుణంగా పంటకు నీటిని పారించాలని, వృథా చేయరాదన్నారు.

వరికి తెగుళ్ల బెడద

పాపన్నపేట, మార్చి 20: మండలంలోని పలు ప్రాంతాల్లో వరికి తెగుళ్లు వ్యాపించినట్లు సహాయ వ్యవసాయ సంచాలకులు విజయనిర్మల, మండల వ్యవసాయాధికారిణి నాగమాధురి తెలిపారు. గురువారం మండలంలోని ఎల్లాపూర్‌లో వరిపంటను పరిశీలించారు. వరికి అగ్గి తెగుళ్లు, కాండం తొలిచే పురుగు సోకిందని, నివారణకు ట్రైసైక్లాజోల్, టెట్రానిలిప్రోల్ మందులు వాడాలన్నారు.

నిలిచిపోయిన మీసేవలు

మీసేవ కేంద్రం వద్ద కరెంట్ లేకపోవడంతో వేచి ఉన్న లబ్ధిదారులు

చిలిపిచెడ్, మార్చి 20: చిలిపిచెడ్‌లో ప్రభుత్వ కార్యాలయాలు, మీసేవ కేంద్రానికి కరెంట్ లేక వివిధ గ్రామాల నుంచి వచ్చి లబ్ధిదారులు పడిగాపులు కాయాల్సి వస్తున్నది. ప్రభుత్వం రాజీవ్ యువ వికాస్ పథకంలో అన్నికులాల వారికి స్వయం ఉపాధి కల్పించేందుకు మీసేవ కేంద్రంలో దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వం తెలుపడంతో వివిధ గ్రామాల నుంచి రోజూ జనం వస్తున్నారు. చిలిపిచెడ్ మీసేవ కేంద్రం వద్ద తరుచూ కరెంట్ లేకపోవడంతో లబ్ధిదారులు అధికారులు, లబ్ధిదారులు, మీసేవ నిర్వాహకులు తలలు పట్టుకుంటున్నారు.

బాల్య వివాహాలతో అనర్థాలు

కౌడిపల్లి, మార్చి 20: బాల్య వివాహాలు చేస్తే ఎన్నో అనర్థాలు జరుగుతాయని, పెండ్లీడు వచ్చిన తరువాతనే పెండ్లి చేయాలని నర్సాపూర్ ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సీడీపీవో హేమాభార్గవి తెలిపారు. మండలంలోని తునికి నల్ల పోచమ్మ దేవీ జాతరలో బాల్య వివాహాలు, బాలల అక్రమ రవాణా, మహిళా శిశువుల ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. సూపర్‌వైజర్లు లక్ష్మి, సంతోష, గంగాధర్, నాగరాజు పాల్గొన్నారు.

పది పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

- నేటి నుంచి పదో తరగతి పరీక్షలు ప్రారంభం
- జిల్లాలో 68 పరీక్ష కేంద్రాలు
- జిల్లా వ్యాప్తంగా 10,388 మంది పరీక్ష రాయనున్న విద్యార్థులు
- అరగంట ముందే పరీక్షా కేంద్రాలకు విద్యార్థులు

హవేళీ ఘనపూర్ మండలం సర్దనలోని పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్ మున్సిపాలిటీ, మార్చి 20: పదో తరగతి పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేందుకు జిల్లా విద్యాశాఖ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. నేటి నుంచి ఏప్రిల్ 4వ తేదీ వరకు ఈ పరీక్షలు నిర్వహించనున్నారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా విద్యాశాఖ చర్యలు అన్ని చేపట్టింది. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్షలు జరుగుతాయి. విద్యార్థులు మాత్రం పరీక్ష సమయానికి గంట ముందు నుంచే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 68 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. అన్ని పరీక్షా కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు.. జిల్లా వ్యాప్తంగా 225 పాఠశాలల నుంచి 10,388 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారు. ఇందులో 5,020 మంది బాలురు, 5,368 బాలికలు ఉన్నారు. ఇందుకోసం 68 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 70 మంది డిపార్టుమెంట్ అధికారులు, సుమారు 590 మంది ఇన్విజిలేటర్లను నియమించారు. మూడు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు, 17 సిటింగ్ స్క్వాడ్ బృందాలు ఏర్పాటు చేశారు. పరీక్షా కేంద్రాలలో సెల్‌ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులు అనుమతించరు.

రామాయంపేట: కస్తూర్బాగాంధీ పాఠశాల విద్యార్థినులకు హాల్‌టికెట్లను అందజేస్తున్న విద్యాధికారి రాధాకిషన్

ప్రశాంతంగా రాసేలా ఏర్పాట్లు

విద్యార్థులు ఎలాంటి మానసిక ఒత్తిడికి గురికాకుండా, ప్రశాంతమైన వాతావరణంలో పరీక్షలు రాసేలా ఏర్పాట్లు చేస్తున్నాం. తాగునీటి, వైద్య సదుపాయలు కల్పిస్తున్నాం. ఒక్కో గదిలో 20 మంది విద్యార్థులను మాత్రమే కేటాయించాం. కాపీయింగ్ జరగకుండా చర్యలు తీసుకుంటున్నాం. పరీక్షలంటే విద్యార్థుల్లో భయం పోవాలి. ఒత్తిడికి గురికాకుండా పరీక్షలు రాస్తే మంచి ఫలితాలు సాధించవచ్చు.

– రాధాకిషన్, డీఈవో, మెదక్

పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి: కలెక్టర్

పదో తరగతి పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులను ఆదేశించారు. గురువారం హవేళీఘనపూర్ మండలం సర్దన జడ్పీహెచ్ఎస్ పరీక్షా కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఏర్పాటు చేసిన 68 పరీక్షా కేంద్రాల్లో 10,388 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారన్నారు. కేంద్రాల్లో తాగునీరు, బెంచీలు, కుర్చీలు, మూత్రశాలల సౌకర్యం వంటి అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. పోలీస్ ఎస్కార్ట్‌తో ప్రభుత్వ వాహనంలో నిర్దేశించిన రూట్లలో మాత్రమే పరీక్షా పత్రాలు కేంద్రాలకు తరలించాలని సూచించారు. విద్యార్థులు తమ సందేహాల నివృత్తికి కంట్రోల్ రూమ్ నంబర్లు 9491676947, 9502494882 సంప్రదించాలన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
WANTED
★ త్రివేణి హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. Ph: 9160900024 / 9640400073.
NT-330663-All
గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.